సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



కిలో టమాట రూ.33

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.33, కనిష్టంగా రూ.10, సరాసరిన రూ.20 ప్రకారం ధర పలికింది.



రైతులను ముంచిన వర్షాలు

గత 15 రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు కడగండ్లనే మిగిల్చాయి. రోజూ వర్షం కురుస్తుండడంతో పంటలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి.

IIలో

గరిష్టం/కనిష్టం
34.8°/22.5°

జిల్లా పరిధిలో గురువారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

రైతు నెత్తిన బీమా పిడుగు

గోరంట్ల మండలం బూడిదగడ్డపల్లికి చెందిన రాఘవేంద్రరెడ్డి రెండేళ్ల క్రితం నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగు చేయగా దిగుబడి బాగా వచ్చింది. పంట కళ్లంలో ఉండగానే భారీ వర్షాలు కురవడంతో తడిసిపోయి ఎందుకూ పనికి రాకుండా పోయింది. అయితే అప్పట్లో వైఎస్ జగన్ ప్రభుత్వం 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా' అమలు చేయడంతో రాఘవేంద్రరెడ్డి రూపాయి ప్రీమియం చెల్లించకుండానే... పంట బీమా అందుకుని గట్టెక్కాడు. కానీ కూటమి ప్రభుత్వం ఈ రబీ సీజన్ నుంచి ఉచిత పంటల బీమాకు మంగళం పాడుతోంది. పరిహారం కావాలంటే రైతులే ప్రీమియం చెల్లించాలని ప్రకటించింది. దీంతో ఎంతో మంది రైతులు బీమాకు దూరం కానున్నారు.



- ఉచిత పంటల బీమాకు కూటమి సర్కార్ మంగళం
- ఇకపై రైతులు ప్రీమియం చెల్లిస్తేనే బీమా
- వైఎస్సార్ సీపీ హయాంలో విజయవంతంగా ఉచిత బీమా అమలు
- జగన్ హయాంలో 2,96,541 మంది రైతులకు రూ.718 కోట్ల లబ్ధి
- కూటమి సర్కారు నిర్ణయంపై రైతుల ఆగ్రహం

కదిరి: 'వ్యవసాయం దండుగ' అంటూ గతంలోనే వ్యాఖ్యానించిన చంద్రబాబు... కూటమి పార్టీల అండతో అధికారంలోకి వచ్చిన రోజునుంచే రైతుల నడ్డి విరిచేందుకు సిద్ధమయ్యారు. 9 గంటల ఉచిత కరెంటుకు కోతలు పెడుతూ రైతులు వాతలు పెడుతున్నారు. తాజాగా రైతులపై పైసా భారం పడకుండా గత ప్రభుత్వం ఐదేళ్లు విజయవంతంగా అమలు చేసిన 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా'కు మంగళం పాడేందుకు సిద్ధమయ్యారు. ఈ పథకం ఎత్తివేసే కుట్రలో భాగంగా పంటల బీమాపై అధ్యయనం కోసం చంద్రబాబు సర్కార్ వ్యవసాయ, పౌరసరఫరాలు, ఆర్థిక శాఖ మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ సూచన మేరకు ఈ సబ్ కమిటీ రైతులకు వ్యతిరేకంగా నివేదికను సమర్పించింది. దీన్ని ఆధారంగా చూపుతూ ఐదేళ్లు విజయవంతంగా అమలవుతున్న వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సమీక్షలోనే అధికారికంగా ప్రకటించారు. ఈ పథకం స్థానంలో 2019కి పూర్వం రైతుల భాగస్వామ్యంతో అమలైన 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన'ను తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. దీన్ని ఈ రబీ సీజన్ నుంచి అమలు చేయాలని నిర్ణయించారు. ఇకపై రైతులు ప్రీమియం చెల్లిస్తేనే బీమాకు అర్హులవుతారు. లేదంటే బీమా కోల్పోతారు.

ఉచిత బీమాతో ఎంతో లబ్ధి..

ఉచిత పంటల బీమాతో రైతులకు ఎంతో లబ్ధి కలిగింది. పంట పండితే రైతులు సంతోషంతో మార్కెట్‌లో విక్రయించుకునే వారు. అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు కోల్పోతే బీమా కింద పరిహారం అందేది. వైఎస్ జగన్ హయాంలో వైఎస్సార్ ఉచిత పంటల బీమాతో జిల్లాలోని 2,96,541 మంది రైతులకు రూ.718.57 కోట్లు లబ్ధి కలిగింది. అందులో కదిరి నియోజకవర్గంలో 55,755 మంది రైతులు రూ.107.53 కోట్లు, ధర్మవరం నియోజకవర్గంలోని 47,870 మంది రైతులకు రూ.191.48 కోట్లు, పుట్టపర్తిలో 67,045 మందికి రూ.78.8 కోట్లు, హిందూపురం నియోజకవర్గంలోని 17,415 మంది రైతులకు రూ.36.22 కోట్లు, మడకశిర నియోజకవర్గంలోని 38,198 మంది రైతులకు రూ.79.29 కోట్లు, పెనుకొండ నియోజకవర్గంలోని 24,276 మంది రైతులకు రూ.99.29 కోట్లు, రాప్తాడు నియోజకవర్గంలో జిల్లా పరిధిలోని మూడు మండలాల్లోని 60,118 మంది రైతులకు రూ.125.96 కోట్లు లబ్ధి చేకూరింది.

జిల్లాలో గత ప్రభుత్వంలో ఉచిత పంటల బీమాతో లబ్ధి ఇలా...

వార్షిక సంవత్సరం	రైతుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	2,96,541	193.89
2020-21	1,28,100	115.57
2021-22	1,72,062	255.78
2022-23	1,77,300	153.33
మొత్తం	2,96,541	718.57

అత్యుత్తమ పథకంగా కొనియాడిన కేంద్రం..

ఈ-క్రాప్ నమోదే ప్రామాణికంగా వైఎస్ జగన్ సర్కార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. రైతు సాగు చేసిన ప్రతి పంటకూ యూనివర్సల్ కవరేజ్ కల్పిస్తూ రైతులపై పైసా భారం పడకుండా 2019 రబీ నుంచి ఉచిత పంటల బీమాను అమలు చేస్తూ వచ్చింది. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం దేశంలోనే 'ది బెస్ట్ క్రాప్ ఇన్సూరెన్స్' పథకమని గతంలో కేంద్రమే అధికారికంగా ప్రకటించింది. ఇన్నోవేషన్ కేటగిరి కింద 2023లో అవార్డును సైతం జగన్ ప్రభుత్వానికి అప్పట్లో అందించింది. ఏపీ స్ఫూర్తితో నోటిఫై చేసిన పంటలకు యూనివర్సల్ కవరేజ్ కల్పించేందుకు 'ఫసల్ బీమా'లో కూడా పలు మార్పులు చేసింది. ఇలాంటి మంచి పథకానికి చంద్రబాబు సర్కారు మంగళం పాడుతోంది.

రైతులను ముంచే ప్రభుత్వమిది



వైఎస్సార్ సీపీ హయాంలో రైతులకు ప్రతి ఏటా రైతు భరోసా నగదు సకాలంలో ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం ఇప్పటి దాకా రూపాయి కూడా ఇవ్వలేదు. ఇప్పుడు ఉచిత పంటల బీమాను కూడా ఎత్తేసి రైతులే ప్రీమియం చెల్లించాలని చెబుతున్నారు. దీనివల్ల చాలా మంది రైతులు బీమాకు నోచుకోలేరు. ఇది కరెక్ట్ కాదు.

– బీఎస్.మక్బూల్ అహ్మద్, కదిరి నియోజకవర్గ సమన్వయకర్త, వైఎస్సార్‌సీపీ

ఉచిత బీమానే మేలు



జగన్ ప్రభుత్వంలో అమలు చేసిన ఉచిత పంటల బీమా చాలా బాగుంది. పంట నష్టపోతే బీమా వచ్చేది. ఇప్పుడు రైతులే ప్రీమియం కట్టాలంటే చాలా మంది చెల్లించలేరు. వారందరికీ బీమా రాదు. రైతులపై ఎలాంటి భారం పడకుండా గత ప్రభుత్వంలో బీమా ఇచ్చారు. పెట్టుబడి సాయం కూడా ఇచ్చారు. ఈ ప్రభుత్వం రైతులకు ఇంత వరకూ ఎలాంటి సాయం చేయలేదు.

– అశోక్ కుమార్‌రెడ్డి, రైతు, తనకల్లు

రైతులపై ఎందుకంత కోపం?



వ్యవసాయం దండగ అన్న చంద్రబాబుకు రైతుల మీద ఏమాత్రం ప్రేమ ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. గతంలో రైతులు ఒక్క రూపాయి చెల్లించకుండానే వైఎస్సార్ ఉచిత పంటల బీమా వర్తించేది. దాన్ని రద్దు చేసేందుకు నిర్ణయించిన చంద్రబాబు... 2019కి మునుపు ఉన్న బీమాను అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో రైతులకు తీరని అన్యాయం జరుగుతుంది. దీన్ని సీపీఎం తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.

–ఇంతియాజ్, జిల్లా కార్యదర్శి, సీపీఎం

రైతు వాటా చెల్లించాల్సిందే



రబీలో ప్రధానమంత్రి ఫసల్ బీమా (దిగుబడి ఆధారిత బీమా)కింద కొన్ని పంటలను, వాతావరణ ఆధారిత బీమా కింద కొన్ని పంటలను ప్రభుత్వం నోటిఫై చేసింది. కొన్ని పంటలు జిల్లా యూనిట్‌గా, మరికొన్నింటికి మండల యూనిట్‌గా, ఇంకొన్ని పంటలు గ్రామం యూనిట్‌గా నోటిఫై అయ్యాయి. ఈ రబీ సీజన్ నుంచి ఆయా పంటలకు బీమా చేసుకోవాలంటే రైతులే ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

– వైవీ సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

న్యూస్‌రీల్

నూతన డీఈఓగా కిష్టప్ప



పుట్టపర్తి: జిల్లా నూతన డీఈఓగా కిష్టప్పను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు డీవైఈఓగా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న మీనాక్షి వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఇదిలా ఉండగా.. బదిలీపై వెళ్తున్న మీనాక్షిని ఉపాధ్యాయ సంఘాల నేతలు అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, ఇంద్రప్రసాద్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సురేష్‌కుమార్, లక్ష్మీనారాయణ ఉన్నారు.

డీఆర్‌ఓగా విజయసారథి

ప్రశాంతి నిలయం: రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా డీఆర్‌ఓగా పనిచేస్తున్న కొండయ్యను జీఏడీలో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. నూతన డీఆర్‌ఓగా ఏపీఐఐసీ ఓఎస్‌డీగా పనిచేస్తున్న విజయ సారథిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు.

అక్రమ మద్యం కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష



రొద్దం: కర్ణాటక మద్యాన్ని అక్రమ తరలిస్తూ పట్టుబడిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష , రూ 2 లక్షల జరిమానా విధిస్తూ పెనుకొండ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బొజ్జప్ప తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. ఆయన వివరాల మేరకు.. 2020న జూన్‌లో పెనుకొండ మండలం మావటూరు గ్రామానికి చెందిన చిన్న అంజినప్ప అనే వ్యక్తి కర్ణాటక మద్యం తరలిస్తుండగా అప్పటి ఎస్ఐ వి.నారాయణ అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసును ఏపీపీ శ్యామల వాదించిట్లు పేర్కొన్నారు. నేరం రుజువు కావడంతో జడ్జి శిక్ష విధించినట్లు కోర్టు కానిస్టేబుల్ కృష్ణమాచారి తెలిపారు.

29, 30 తేదీల్లో సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్

పుట్టపర్తి టౌన్: అఖిల భారత సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్-2024లో భాగంగా ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయభాస్కర్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 29న పెనుకొండలోని కేవీకే కళాశాలలో బ్యాడ్మింటన్, ధర్మవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, హాకీ, వాలీబాల్ పోటీలు ఉంటాయి. 30న ధర్మవరంలోని కళ్యాజ్యోతిలో స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, పవర్‌లిఫ్టింగ్, క్యారమ్స్, చదరంగం, లాన్ టెన్నిస్, యోగా పోటీలు ఉంటాయి. ఆయా పోటీల్లో ప్రతిభ చూపిన వారిని నవంబర్ 6, 9 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. అర్హత, ఆసక్తి ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల మహిళా, పురుష ఉద్యోగులు తమ శాఖాధిపతి ధ్రువీకరణ పత్రాలు పొంది ఈ నెల 28లోపు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో సమర్పించి పేర్లు నమోదు చేసుకోవాలి.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- కలెక్టర్ టీఎస్ చేతన్



తెగిన కనగానపల్లి చెరువు కట్ట మరమ్మతు పనులపై ఎమ్మెల్యే సునీతతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

కనగానపల్లి: భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టర్ టీ.ఎస్. చేతన్ తెలిపారు. కనగానపల్లిలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా భారీ వర్షాలకు తెగిపోయిన చెరువు కట్టను ఆయన పరిశీలించారు. చెరువు కట్ట తెగిపోవటం వల్ల ఆయకట్టు కింద ఉన్న వరిమడులు అన్ని దెబ్బ తిన్నట్లు స్థానిక అధికారులు, రైతులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం అక్కడికి వచ్చిన రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలసి ఆయన చెరువు నీటి వల్ల కోతకు గురైన వరి పంటలను పరిశీలించారు. ఒక్కసారిగా చెరువు కట్ట తెగపోవటం వల్ల పంటలపై నీరు ప్రవహించి పూర్తిగా దెబ్బ తిన్నాయని స్థానిక రైతులు వారివద్ద ఆవేదన వ్యక్తం చేశారు. కోతకు గురైన పంటల వివరాలంటిపై నివేదిక తయారుచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. చెరువు కట్ట మరమ్మతు పనులను త్వరలో పూర్తి చేయిస్తామన్నారు. చెరువు కట్ట మరమ్మతు పనుల కోసం రూ.50 లక్షలు విడుదల చేయాలని ఎమ్మెల్యే సునీత కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, జలవనరులశాఖ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఉద్యావన శాఖాధికారి చంద్రశేఖర్, వ్యవసాయశాఖ ఏడీఏ కిష్టయ్య, తహసీల్దార్ రమాదేవి, ఏఓ కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఎక్కడైనా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద్‌నాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వం ద్వారా లైసెన్సు పొందిన 87 మద్యం షాపుల్లోనే మద్యాన్ని విక్రయించాలన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయ పార్టీలకు, నాయకులకు ప్రమేయం ఉన్నా చర్యలు తప్పవన్నారు. కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. బెల్ట్ షాపులకు మద్యం విక్రయించిన షాపులపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తుంటే ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేటి నుంచి పశు గణన

ప్రశాంతి నిలయం: పశు గణన జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. పశుగణనకు సంబంధించిన పోస్టర్లు, బ్రోచర్లు, స్టిక్కర్లు, సూచన పుస్తకాలను కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ శుభదాస్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి 2025 ఫిబ్రవరి 28 తేదీ వరకూ పశుగణన జరుగుతుందన్నారు. 16 రకాల పెంపుడు జంతువుల సమాచారాన్ని జాతుల వారీగా సేకరిస్తారన్నారు. పశు గణన ద్వారా ఈ రంగంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధికి తోడ్పడేలా కార్యక్రమాల రూపకల్పనకు ఉపకరిస్తుందన్నారు.

'పంటల బీమా' వేగవంతం చేయండి

పంటల బీమా పథకం అమలు తీరుపై వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ బి రాజశేఖర్ అన్ని జిల్లాల కలెక్టర్లు వ్యవసాయశాఖ జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో గురువారం రాష్ట్ర రాజధాని నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చేతన్, వ్యవసాయశాఖ అధికారులు హాజరయ్యారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. పంటల బీమా పథకానికి రైతులే ప్రీమియం చెల్లించాలని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డిసెంబర్ 15వ తేదీ నాటికి పంటల బీమా నమోదు ప్రక్రియ ముగించాలన్నారు. సీఎస్‌సీ సెంటర్ లేదా సచివాలయాలకు వచ్చి రైతులు తమ ప్రీమియాన్ని చెల్లించవచ్చన్నారు.

పనులను అడ్డుకుంటే చర్యలు

జిల్లాలో జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్, హైవే, రైల్వే పనులను ఉద్దేశపూర్వకంగా ఎవరైనా అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో కలిసి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్, హైవే, రైల్వేలైన్ పనుల పురోగతిపై సంబంధితశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న నేషనల్ హైవే, రైల్వే నిర్మాణపు పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పరిహారం చెల్లింపు విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకూడదని తెలిపారు. ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్, శర్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, అధికారులు

త్వరలో ఆర్‌యూబీ పనులు

గుంతకల్లు: స్థానిక ధర్మవరం రైల్వే గేట్ ప్రాంతంలో త్వరలో ఆర్‌యూబీ పనులు ప్రారంభించనున్నట్లు ఏడీఆర్ఎం యు.సుధాకర్ తెలిపారు. ఏపీ రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ గురువారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్, జోనల్ పరిధిలోని డీఆర్ఎంలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన రైల్వే ప్రాజెక్టులు, అమరావతికి కనెక్టివిటీ రైలు మార్గ పనులు, ఇతర అంశాలపై చర్చించారు. అనంతరం విలేకరులతో ఏడీఆర్ఎం సుధాకర్ మాట్లాడుతూ... గుంతకల్లులోని ధర్మవరం రైల్వేగేట్‌ను తొలిగించి ఆర్‌యూబీ పనులను చేపట్టడానికి మరోసారి క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టనున్నామన్నారు. ప్లాన్‌లో భాగంగా ఆర్‌యూబీ ఎత్తును పెంచడంతో పాటు మరికొన్ని మార్పులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే గుత్తి-పెండేకల్లు 29 కి.మీ.ల డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులకు దాదాపు రూ.350 కోట్లతో ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్

బానిషా బతుకులు !

- మత్తుకు బానిసలవుతున్న యువత
- మైనర్లది కూడా అదే బాట
- నేరస్తుల్లో ఎక్కువ మంది మత్తు బానిసలే
- గుట్టు చప్పుడు కాకుండా గంజాయి విక్రయాలు

సాక్షి, పుట్టపర్తి: మత్తు పదార్థాలకు ఒక్కసారి అలవాటు పడితే వాటి నుంచి దూరం కావడం చాలా కష్టతరం. సరదా వాడకం చివరకు వారి జీవితాలను నరకప్రాయంగా మారుస్తోంది. బంగారు భవితను నాశనం చేస్తోంది. నిండు జీవితాలను పాతాళానికి తీసుకెళ్తోంది. తల్లిదండ్రులకు అంతు లేని ఆవేదన మిగులుస్తోంది. మత్తు వ్యసనం కారణంగా చిన్నారులు కూడా పెడదోవ పట్టి నేరాలకు పాల్పడుతున్నారు. మత్తులో దాడులు చేయడం, నేరాలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది.

వాట్సాప్ గ్రూపుల్లో...

సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటున్న యువత వాట్సాప్ గ్రూపులను గంజాయి అమ్మకాల సమాచారానికి అడ్డాగా మార్చుకుంటోంది. కోడ్ భాషలో పోస్టులు పెడుతూ విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం. చీకటి పడగానే.. వాట్సాప్ గ్రూపుల్లో పేర్కొన్న ప్రాంతాలకు చేరుకుని కొనుక్కుని వెళ్లిపోతున్నారు. గంజాయి పీలుస్తున్న వారిలో ఎక్కువగా యువత ఉంటుండం ఆందోళన కలిగిస్తోంది. గంజాయి పీల్చిన మత్తులో చాలామంది నేరాలకు పాల్పడుతున్నారు. పలు నేరాల్లో నిందితులుగా ఉన్న వారిలో సుమారు 70 శాతం మంది మత్తు బానిసలుగా తేలడం గమనార్హం.



పుట్టపర్తిలో గంజాయి విక్రేతను అరెస్టు చూపిస్తున్న పోలీసులు (ఫైల్)

గుట్టు చప్పుడు కాకుండా..

మాదక ద్రవ్యాలు పొరుగు రాష్ట్రాల నుంచి ముదిగుబ్బ, హిందూపురం, పెనుకొండ రైల్వేస్టేషన్‌లకు గుట్టు చప్పుడు కాకుండా చేరుతున్నాయి. అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు రాత్రి వేళల్లో మహిళలు, చిన్నారుల ద్వారా అక్రమంగా సరఫరా సాగుతున్నట్లు తెలిసింది. ఎవరికీ అనుమానం రాకుండా బీడీలు, సిగరెట్లు, కూల్ డ్రింక్ బాటిళ్లు, చాక్లెట్ల రూపంలోకి మార్చి అమ్మకాలు చేస్తున్నారు. మత్తుకు అలవాటు పడిన వారు ఏ ప్రాంతాల్లో ఉన్నారు. గంజాయి కొనేందుకు ఎక్కడికి వస్తారు? సరుకు ఎవరికి ఎంత ఇవ్వాలి? తదితర విషయాలన్నీ గోప్యంగా జరుగుతాయి.

మత్తులో అఘాయిత్యాలు..

దసరా పండుగకు ముందు రోజు రాత్రి చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ పేపర్‌మిల్ వద్ద వాచ్‌మెన్‌గా ఉన్న కుటుంబంపై దుండగులు దాడి చేసి తండ్రి కుమారులను చితకబాది ఆపై అత్తా కోడళ్లపై అత్యాచారం చేసి సంఘటన రాష్ట్రంలో సంచలనం కలిగించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆరుగురిని అదుపులోకి తీసుకోగా.. అందులో ముగ్గురు మైనర్లు ఉన్నారు. వారందరూ హిందూపురం పట్టణానికి చెందిన వారే. గంజాయి బ్యాచ్‌గా పేరుపొందిన వారుగా సమాచారం.

టీనేజీ వయసులోనే..

జల్సాలకు పోయి టీనేజీ వయసులోనే మద్యం తాగుతున్న వారి సంఖ్య 20 శాతానికి పైగా ఉంది. హిందూపురం పట్టణంలో రహమత్‌పూర్, ఆటో నగర్, మోడల్ కాలనీ, సిల్క్ కాలనీ, చిన్న మార్కెట్ ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు కొందరు రహస్యంగా చేస్తున్నట్లు తెలుస్తోంది. గతేడాది గంజాయి మత్తులో కొటిపి రోడ్డులో ఓ వ్యక్తిని కొట్టి చంపిన సంఘటన ఇంకా మరవకనే మత్తులో ఇద్దరిపై అత్యాచారానికి పాల్పడ్డ సంఘటన వెలుగు చూసింది.

భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు



మత్తుకు ఎవరూ బానిసలుగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోకండి. కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలి. మత్తులో ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడినా చట్టరీత్యా శిక్షార్హులే. క్షణికావేశంలో ఏవేవో చేసి.. అవనసరంగా జీవితాలను పాడు చేసుకోవద్దు. కాలేజీ పిల్లలపై తల్లిదండ్రులు కచ్చితంగా నిఘా ఉంచాలి. – వి.రత్న, ఎస్పీ

ఆకట్టుకున్న నృత్యరూపకం

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన అనకాపల్లి సత్యసాయి భక్తులు గురువారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయి పథం సన్మార్గ వర్తనం పేరుతో అనకాపల్లి సత్యసాయి యూత్ బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. సత్యసాయి మహిమలను ఈ సందర్భంగా చిన్నారులు అద్భుతంగా ప్రదర్శించారు. అనంతరం సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు.



రక్తి కట్టించిన భక్త పుండరీకుడి సన్నివేశం





విష్ణుతత్వాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు, నృత్య రూపకంతో ఆకట్టుకుంటున్న బాలికలు

క్లుప్తంగా

జాతీయ స్థాయి జూడో పోటీలకు కేజీబీవీ విద్యార్థిని



విద్యార్థిని మౌనికతో పీఈటీ మహేశ్వరి

చెన్నేకొత్తపల్లి: స్థానిక కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న మౌనిక జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికై ంది. ఈ మేరకు ఆ విద్యాలయం ఎస్‌ఓ సువర్ణ, పీఈటీ మహేశ్వరి గురువారం తెలిపారు. ఈ నెల 20, 21 తేదీల్లో శ్రీకాళహస్తిలో జరిగిన అండర్–17 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన మౌనికను జాతీయ స్థాయి పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. త్వరలో త్రిపురలో జరిగే జాతీయ స్థాయిలో పోటీలో ఏపీ తరఫున ఆమె ప్రాతినిథ్యం వహించనున్నారు. ప్రతిభ చాటిన మౌనికను కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది, సహ విద్యార్థులు అభినందించారు.

మద్యం అక్రమ విక్రేతల అరెస్ట్



పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ లక్ష్మీదుర్గయ్య

హిందూపురం అర్బన్: అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న పలువురిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. అందిన పక్కా సమాచారంతో గురువారం ఉదయం హిందూపురంలోని సంతేబిదనూరు, మేళాపురం, బీచగానపల్లి, ఊటకూరు, శ్రీరంగ రాజుల పల్లిలో తనిఖీలు చేపట్టామన్నారు. ఆ సమయంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసి 254 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



మృతురాలు అలివేలమ్మ

పెనుకొండ రూరల్: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ వివాహిత మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం మరువపల్లికి చెందిన చాకలి అలివేలమ్మ (43)కు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ముగ్గురు పిల్లలకూ పెళ్లిళ్లు చేశారు. గురువారం ఉదయం ఉతికిన దుస్తులను ఆరబెట్టేందుకు మిద్దె మీదకు వెళ్లిన ఆమె... చేతికి అందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగలడంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైతులను ముంచిన వర్షాలు

- పంట కోతల సమయంలో భారీ వర్షాలు
- ఉత్పత్తులు, పశువుల మేత కూడా దక్కని వైనం
- ధాన్యం రంగు మారడంతో ధర తగ్గించిన వ్యాపారులు



రంగు మారిన వేరుశనగ కాయలను ఆరబోస్తున్న బీడుపల్లి రైతు



తడిసిన మొక్కజొన్న విక్రయానికి సిద్ధంగా ఉంచిన దృశ్యం

పుట్టపర్తి అర్బన్: గత 15 రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు కడగండ్లనే మిగిల్చాయి. రోజూ వర్షం కురుస్తుండడంతో పంటలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ముఖ్యంగా వేరుశనగ పంట కోతల సమయం ఆసన్నం కావడంతో చాలా మంది రైతులు పొలాల్లో చెట్లను తొలగించి, కాయలను వేరు చేసి ఆరబెట్టారు. అయితే వర్షం కారణంగా కాయలు రంగు మారడంతో పాటు కొన్ని పొలాల్లో మొలకలూ వచ్చాయి. మొక్కజొన్నలు సైతం ఆరక పోవడంతో బూజుపట్టి రంగు మారాయి. వరి పంట నేలకొరిగి వడ్లు మొలకలు వచ్చే పరిస్థితి నెలకొంది. దీంతో పశువుల మేత కూడా దక్కకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరలు తగ్గించి... తూకాల్లో దగా చేసి..

ఇప్పటికే తొలగించిన పంటల్లో వేరుశనగ కాయలు, మొక్కజొన్న గింజలు రంగు మారాయి. వీటిని చూసిన వ్యాపారులు కొనుగోలు చేయకుండా వెనుదిరిగి వెళుతున్నారు. కొందరు వ్యాపారులు ముందుకు వచ్చినా... తక్కువ ధరకు అడుగుతుండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. రైతులు నష్టపోకుండా రంగు మారిన ధాన్యాన్ని కచ్చితంగా కొనుగోలు చేయాలని కూటమి సర్కార్ స్పష్టమైన ఆదేశాలు జారీచేయకపోవడంతో మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్ కూడా ముందుకు రాలేదు. దీంతో వ్యాపారుల ఆగడాలు మితిమీరిపోయాయి. వేరుశనగ 46 కిలోల బస్తా కే6 రకం మంచి కొటన్ ఉన్నా... వాటిని రూ.2,600 నుంచి రూ.3వేలు వరకూ అడుగుతున్నారు. కదిరి–లేపాక్షి రకం వేరుశనగను రూ.1,600 నుంచి రూ.2వేలు అడుగుతున్నారు. 15 రోజుల క్రితం ఇదే వేరుశనగ కాయలను రూ.3,800 వరకూ కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రస్తుతం తక్కువ ధరకు అడుగుతుంటే విక్రయించేందుకు రైతులు సుముఖత వ్యక్తం చేయడం లేదు. అలాగే మొక్కజొన్న క్వింటా 15 రోజుల క్రితం రూ.3వేలకు పైగా కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రస్తుతం రూ.2 వేలకు కూడా అడగడం లేదు. నేలకొరిగిన వరి మడిని కూలీల ద్వారా పైరును గుమ్ములు కడుతున్నారు. దీంతో అదనంగా కూలీల ఖర్చులు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వ్యాపారులు బస్తా వేరుశనగ 42 కిలోలు ఉంటే 46 నుంచి 50 కిలోల వరకూ అధికారికంగా తీసుకుంటున్నారు. మొక్కజొన్న, వరి క్వింటా పేరుతో 110 కిలోల నుంచి 120 కిలోల వరకూ తీసుకుంటున్నారు. ఎందుకని ప్రశ్నిస్తే రంగు మారిందని చెబుతున్నారు.

వలసలపై రైతాంగం దృష్టి..

జిల్లాలో 1,332 హెక్టార్లకు గాను 50 వేల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లుగా అధికారులు కాకి లెక్కలు వేశారు. పంట పాక్షికంగా కాకుండా 33 శాతం కంటే అధికంగా నష్టపోతేనే లెక్కలోకి వస్తుందని అధికారులు పేర్కొనడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక రంగు మారిన ధాన్యం గురించి ఊసే లేకుండా పోయింది. వేరుశనగ, మొక్కజొన్న, వరి పంటలతో పాటు పత్తి, కూరగాయల పంటలకూ వంద శాతం నష్ట పరిహారం అందించి ఆదుకోకపోతే జీవనం భారమవుతుందని రైతులు అంటున్నారు. దీంతో కుటుంబంతో కలసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి కూలి పనులతో జీవనం సాగించాలనే ధోరణి జిల్లా రైతుల్లో వ్యక్తమవుతోంది.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



వర్షాలకు తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ప్రైవేట్ వ్యాపారుల ద్వారా రైతులకు నష్టాలు తప్పడం లేదు. ధర తక్కువ చేయడమే కాక తూకాల్లోనూ మోసం చేస్తున్నారు. దీంతో కనీసం పెట్టుబడులు కూడా చేతికి దక్కడం లేదు. – రామలింగయ్య, వేరుశనగ రైతు, వెంకటగారిపల్లి

ఇబ్బంది పెడుతున్న వ్యాపారులు



నేను 80 బస్తాల మొక్కజొన్న సిద్ధం చేసి ఉంచా. 15 రోజుల క్రితం క్వింటా రూ.3 వేలకు కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రస్తుతం రూ.2 వేలకు అడుగుతున్నారు. దీంతో పాటు రంగు మారిన ధాన్యం అని తూకంలో 10 కేజీలు అదనంగా తీసుకుంటున్నారు. ఇప్పుడు అమ్మితే నాకు రూ. లక్ష వరకూ నష్టం వస్తుంది. వర్షాలతో తీవ్రంగా నష్ట పోయాను. ప్రభుత్వం ఆదుకోవాలి. – శ్రీనివాసరెడ్డి, మొక్కజొన్న రైతు, లింగాలపల్లి, ఓడీచెరువు

ఖాకీల అదుపులో నలుగురు?

- కొలిక్కి వస్తున్న రామాపురం కాల్పుల ఘటన కేసు

బత్తలపల్లి: కలకలం సృష్టించిన తుపాకీ కాల్పుల కేసులో రెండు ముఠాలకు చెందిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అనంతపురం – కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి మండలం రామాపురం కూడలిలో ఆదివారం ఉదయం దుండగులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ ఘటనను పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని డీఎస్పీ శ్రీనివాసులు నేతృత్వంలో విచారణ వేగవంతం చేశారు. కాల్పులు జరిపిన అనంతరం పారిపోతున్న రాయచోటి ప్రాంతానికి చెందిన ఓ షికారీ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. విచారణలో దుండగుడు పలు ఆసక్తికర విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. వీటి ఆధారంగా సీఐ ప్రభాకర్ నేతృత్వంలో ఓ బృందం, ఎస్‌ఐ సోమశేఖర్ నేతృత్వంలో మరో బృందంగా విడిపోయి దుండగుల కోసం హైదరాబాద్, రాయచోటి ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో మరో ముగ్గురుని అదుపులోకి తీసుకుని, రహస్య ప్రదేశంలో విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

బంగారం అపహరణకేనా?

పోలీసుల అదుపులో ఉన్న షికారీలు పలు ఆసక్తికర విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. తాము పునాదులు తవ్వుతుండగా బంగారం లభ్యమైందని, దీనిని తక్కువ ధరకే ఇస్తామంటూ హైదరాబాద్‌కు చెందిన వారితో షికారీలు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఈ మొత్తం ప్రక్రియ సెల్‌ఫోన్ ద్వారానే జరిగింది. అనంతరం ఆదివారం హైదరాబాద్‌కు చెందిన వారు నగదు అప్పగించి బంగారం స్వాధీనం చేసుకునేందుకు వచ్చారు. అంతకు ముందే హైదరాబాద్ వాసులు మరో కారులో కొందరిని పోలీసుల తరహాల అక్కడకు చేరుకుని మాటు వేసేలా పక్కా ప్రణాళిక రచించారు. కాసేపటికి అక్కడకు ద్విచక్ర వాహనంలో చేరుకున్న షికారీ యువకులు బంగారం ఇచ్చి డబ్బు మార్చుకునే సమయంలో పోలీసుల డ్రస్సుల్లో ఉన్న వారు అక్కడకు చేరుకోవడం, ఎయిర్ గన్లతో కాల్పులు జరపడం వంటి చర్యలకు పాల్పడ్డారు. దీంతో షికారీలు భయపడి తమ వద్ద ఉన్న మూటను విసిరేసి ద్విచక్రవాహనాల్లో పారిపోయారు. అనంతరం ఆ మూటను హైదరాబాద్ వాసులు తీసుకుని ఏమీ తెలియనట్టుగా కారులో ఉడాయించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. షికారీల్లో ఒకరు చిత్రావతి నది వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్నట్లుగా పసిగట్టి అదుపులోకి తీసుకుని విచారణ వేగవంతం చేశారు. సీసీ కెమెరా పుటేజీల్లో నిక్షిప్తమైన కారు నెంబర్ల ఆధారంగా యజమానికి ఫోన్ చేసి వివరాలు సేకరించారు. కాగా, బంగారం అపహరణకే ఇంత హైడ్రామా నడిపినట్లుగా తెలుస్తోంది.

15 నుంచి 'గుడ్డం' బ్రహ్మోత్సవాలు

హిందూపురం: వచ్చే నెల 15 నుంచి 19వ తేదీ వరకూ హిందూపురంలోని గుడ్డ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహ సింగ్, ఆలయ ఈఓ నాగేంద్రుడు, అర్చకుడు గోవిందశర్మ గురువారం తెలిపారు. 15న సుప్రభాత సేవతో ఉత్సవాలు మొదలు కానున్నాయి. ఉత్సవ మూర్తుల ప్రాకారోత్సవం, గంగా పూజ, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాన నాంది రక్షాబంధన దీక్ష, వాస్తు హోమాలు దేవాలయ అష్టబంధనం కార్యక్రమాలు ఉంటాయి. 16న ధ్వజారోహణం, కళాశార్చన, శ్రీకంఠాపురం గ్రామ ప్రజల జ్యోతుల ఉత్సవం, సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవం ఉంటుంది. 17న ధాత్రి, రథా హోమాలు, మధ్యాహ్నం 1.30 గంటలకు రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ సేవ,18న రంగనాథస్వామి శయనోత్సవం, మంగళహారతి, 19న చక్రస్నానం, ధ్వజావరోహణం, కలశ ఉద్వాసన, సాయంత్రం ముత్యాలపల్లకీలో నగర ఉత్సవం నిర్వహించనున్నారు.

పెళ్లి కాలేదని యువకుడి బలవన్మరణం



మృతుడు రామకృష్ణ

గుడిబండ: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం ఎస్.రాయాపురం గ్రామానికి చెందిన సిద్దప్ప, లక్ష్మమ్మ దంపతులకు నలుగురు కుమారులు ఉన్నారు. వీరిలో రామకృష్ణ(35) అనే కుమారుడు దీర్ఘకాలిక జబ్బులతో సతమతమవుతుండడంతో పెళ్లి కాలేదు. పలు చోట్ల వైద్యం చేయించుకున్నా నయం కాలేదు. దీంతో ఇక తనకు పెళ్లి కాదని ఇతరులతో చెప్పుకుంటూ బాధపడేవాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన గురువారం తెల్లవారుజామున తమ ఇంటి సమీపంలో ఉన్న పశువులు కొట్టంలో ఇనుప దూలానికి పలుపు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా అటుగా వెళ్లిన కుటుంబ సభ్యుడు విషయాన్ని గుర్తించి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని ఉరికి వేలాడుతున్న రామకృష్ణను కిందికి దించి పరిశీలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఎస్.రాయాపురం గ్రామానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల అదుపులో హత్య కేసు అనుమానితులు?

రొద్దం: మండలంలోని ఎల్‌జీబీనగర్–సత్తారుపల్లి రోడ్డు పక్కన ఉన్న ఈత వనంలో దారుణ హత్యకు గురైన ధనాపురం కురుబ రమేష్ కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని నిర్ధారించినట్లు సమాచారం. ఈ కేసులో పరిగి మండలంలోని ఓ గ్రామానికి చెందిన పలువురిని అనుమానితులుగా అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

కబళిస్తున్న 'ముద్ద' వ్యాధి

- 2022లో అలజడి
- మళ్లీ పాడి పశువుల్లో కనిపిస్తున్న వ్యాధి లక్షణాలు



ముద్దచర్మ వ్యాధితో బాధపడుతున్న దూడ

అనంతపురం అగ్రికల్చర్: ప్రమాదకరమైన ముద్దచర్మవ్యాధి (లంపీస్కిన్ డిసీజెస్–ఎల్ఎస్‌డీ) పాడి పశువులను కబళిస్తోంది. ఇప్పటికే అక్కడక్కడ పాడి ఆవులు, దూడల శరీరాలపై పొక్కులు, పుండ్లు, బుడిపెలు ఏర్పడినట్లు రైతులు చెబుతున్నారు. అయితే వ్యాధి నివారణపై పశుశాఖ అధికారులు ఇంకా దృష్టి సారించినట్లు కనబడటం లేదు.

వ్యాధి లక్షణాలు, నివారణ..

ముద్దచర్మ వ్యాధి సోకిన పశువులు తీవ్ర జ్వరంతో బాధపడుతుంటాయి. మేత మేయకపోవడం, పాడి, పునరుత్పత్తి తగ్గిపోవడం, చర్మం మీద పొక్కులు ఏర్పడటం, నోరు, ముక్కు నుంచి చొంగ కారడం, గడ్డలు పగిలి రక్తం కారడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. దోమలు, ఈగలు, జోరీగలు, పిడుదులు లాంటి రక్తాన్ని పీల్చే పురుగులు కుట్టడం వల్ల ఒక పశువు నుంచి మరొక పశువుకు వ్యాధి వ్యాపిస్తుంది. లక్షణాలు కనిపించిన పశువు లేదా గేదెను వేరు చేసి దానికి రాగి గంజి, పచ్చిమేత ఇవ్వాలి. గుప్పెడు కుప్పింటాకు ఆకులు, గుప్పెడు వేపాకు, గుప్పెడు గోరింటాకు, గుప్పెడు తులసి ఆకులు, రెండు వెల్లుల్లి రెమ్మలు, 20 గ్రాముల పసుపు కలిపి ముద్దగా నూరి 500 గ్రాముల కొబ్బరి నూనెలో మరిగించి చల్లార్చిన తర్వాత పశువు శరీరానికి లేపనంగా పూసినా ఫలితం ఉంటుంది. అలాగే 10 తమలపాకులు, 10 గ్రాముల నల్లమిరియాలు, 10 గ్రాముల సాధారణ ఉప్పును ముద్దగా చేసి బెల్లంలో కలిపి రోజుకు మూడు సార్లు తినిపించినా నివారణ సులభమని ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

2022లో కబళించిన వ్యాధి..

2022లో ఈ వ్యాధి దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పశువులను కబళించి పాడి రైతులను తీవ్ర గందరగోళానికి గురి చేసింది. అప్పట్లో జిల్లా పాడి రైతులనూ ఈ వ్యాధి భయపెట్టింది. అయితే అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం, పశుసంవర్ధకశాఖ అధికారులు తక్షణమే అప్రమత్తమై వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు తీసుకున్నారు. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా 10 వరకు పాడి పశువులు మృత్యువాత పడ్డాయి. 2022లో ఐదారు నెలల పాటు మార్కెట్ యార్డులు, మరికొన్ని ప్రాంతాల్లో జరుగుతున్న పశువుల సంతలనూ బంద్ చేయించారు. ఆవులు, గేదెల క్రయ విక్రయాలు, రవాణాను బాగా కట్టడి చేశారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా ఉంచారు. సరిహద్దు మండలాల పరిధిలో లక్ష వరకు పశువులు, గేదెలకు ముందు జాగ్రత్తగా గోట్‌ఫాక్స్ వ్యాక్సినేషన్ ఉచితంగా ఇవ్వడంతో తగ్గుముఖం పట్టింది. దీంతో రెండు నెలల్లోనే అదుపులోకి వచ్చింది. తాజాగా మళ్లీ అక్కడక్కడ వ్యాధి లక్షణాలు కనిపిస్తుండటంతో పాడి రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

యువ న్యాయవాది ఆత్మహత్య



రుక్సానా (ఫైల్)

అనంతపురం: ఉద్యోగాన్వేషణలో విసిగిపోయిన ఓ యువ న్యాయవాది జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంది. అనంతపురం రెండో పట్టణ ఎస్‌ఐ రుష్యేంద్రబాబు తెలిపిన మేరకు... శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం సిద్ధరాంపురం గ్రామానికి చెందిన జి.లాలూసాహెబ్‌కు ముగ్గురు కుమార్తెలు కాగా, వారి చదువుల కోసమని రెండేళ్ల క్రితం అనంతపురానికి వలస వచ్చి కోర్టు రోడ్డులోని ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. పెద్ద కుమార్తె రుక్సానా (27) అనంతపురం జిల్లా కోర్టులో జూనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. సీనియర్ న్యాయవాది ఎల్. ప్రభాకర్‌రెడ్డి వద్ద ప్రాక్టీస్ చేస్తున్న ఆమె అనంతపురం న్యాయవాదుల బార్ అసోసియేషన్‌లో క్రియాశీల సభ్యురాలిగా ఉన్నారు. రెండో కుమార్తె ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా, మూడో కుమార్తె అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. ఈ క్రమంలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న రుక్సానా ఉద్యోగ ప్రయత్నాలు ముమ్మరం చేస్తూ వచ్చారు. అయినా ఏ ఒక్క అవకాశమూ రాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె... నెల రోజులుగా తీవ్ర మానసిక వేదనతో కోర్టుకు కూడా వెళ్లకుండా ఇంటి పట్టునే ఉంటూ వచ్చారు. ఈ క్రమంలోనే గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనపై అనంతపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఎస్కేయూ క్యాంపస్ కళాశాలలో ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన రుక్సానాకు గత ప్రభుత్వంలో నెలకు రూ.5 వేలు స్టయిఫండ్ అందేదని, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత స్టయిఫండ్ అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ వచ్చినట్లుగా సమాచారం. వృత్తిలో నిలదొక్కుకునే వరకూ జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వ చేయూత అవసరమని యువ న్యాయవాదులు డిమాండ్ చేశారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

గార్లదిన్నె: పోక్సో కేసులో ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలంలోని ఓ మైనర్ బాలికతో పరిచయం పెంచుకున్న మర్తాడు గ్రామానికి చెందిన షేక్ గౌస్‌పీరా... ఇటీవల తనను పెళ్లి చేసుకోవాలంటూ వేధించసాగాడు. విషయం తెలుసుకున్న బాలిక బంధువులు ఈ నెల 17న మర్తాడుకు వెళ్లి గౌస్‌పీరాను మందలించారు. ఆ సమయంలో కొడవలితో గౌస్‌పీరా దాడి చేయడంతో బాలిక బంధువులు ఇద్దరు గాయపడ్డారు. ఘటనపై క్షతగాత్రుడు బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు గౌస్‌పీరాపై పోలీసులు పోక్సో చట్టంతో పాటు, హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో నిందితుడిని గురువారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

యర్రగుంట్లలో చిరుత సంచారం

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్ల గ్రామ సమీపంలోని పొలాల్లో కొద్ది రోజులుగా చిరుత పులి సంచరిస్తున్నట్లు రైతులు గుర్తించారు. చిరుత పులి అడుగు జాడలు కనిపించడంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి చిరుతలు పొలాల్లోకి వచ్చినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో తోటల వద్దకు వెళ్లేందుకు రైతులు, కూలీలు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల యర్రగుంట్లలో చిరుత ఒక గొర్రెపై దాడి చేసి చంపినట్లు గ్రామస్తులు వాపోయారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతను గుర్తించి, అటవీ ప్రాంతంలోకి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక



ఎంపికైన సాయిభవిత

పెనుకొండ: స్థానిక శాంతినికేతన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని సాయి భవిత రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైంది. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన ఆమె... జిల్లా జట్టులో చోటు దక్కించుకుంది. నవంబర్ 3 నుంచి 5 వరకు నెల్లూరు వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో సాయి భవిత ప్రాతినిథ్యం వహించడంపై ఆ పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంతరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు 'పీసీఎంఆర్' విద్యార్థి



వెంకట అభిషేక్

ధర్మవరం రూరల్: మండలంలోని నాగలూరు వద్ద ఉన్న రూపారాజా పీసీఎంఆర్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి వెంకట అభిషేక్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆ పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ గురువారం తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–17 హాకీ పోటీల్లో రాణించిన వెంకట అభిషేక్‌కు జిల్లా జట్టులో దక్కిందన్నారు. నవంబర్ 3 నుంచి నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో జిల్లా జట్టు తరఫున తమ పాఠశాల విద్యార్థి ప్రాతినిథ్యం వహిస్తుండడంపై చైర్మన్ హర్షవర్ధన్‌తో పాటు డైరెక్టర్లు రూపారాజ, కృష్ణా, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక అక్రమ తరలింపు ఆపండి

హిందూపురం అర్బన్: శిథిలావస్థలో ఉన్న పెన్నానది చిన్నబ్రిడ్జి మీదుగా ఇసుక అక్రమ తరలింపు ఆపాలని, లేకపోతే బ్రిడ్జి కూలిపోయే ప్రమాదముందని సంతేబిదనూరు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ వెంకటేష్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో యువమోర్చ జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి, గ్రామస్తులు రామాంజనేయులు, నటరాజ్, ఆవులప్ప, వినయ్, రామచంద్ర, అంజప్ప ఉన్నారు.

సౌత్‌జోన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎస్కేయూ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఎస్కేయూ రెక్టార్ జి.వెంకటనాయుడు

అనంతపురం: ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు తమిళనాడులోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వేదికగా జరిగే అంతర వర్సిటీ సౌత్‌జోన్ బాల్‌బ్యాడ్మింటన్ (మెన్స్) టోర్నీలో ప్రాతినిథ్యం వహించే ఎస్కేయూ జట్టును గురువారం ఎంపిక చేశారు. ఈ మేరకు ఎస్కేయూ క్రీడా కార్యదర్శి డాక్టర్ బి.జెస్సీ తెలిపారు. ఎంపికైన వారిలో అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలకు చెందిన గాజుల మహమ్మద్ మసూద్‌వలి, పి.ఉదయ్ నరసింహ, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విద్యార్థి ఈ.షాలోమ్, పీవీకేకే విద్యార్థి వై.పవన్, ఎస్‌వీ డిగ్రీ కళాశాల విద్యార్థి వై.గౌతమ్ ఉన్నారు. జట్టులో చోటు దక్కించుకున్న క్రీడాకారులను రెక్టార్ జి. వెంకటనాయుడు అభినందించారు.

పంట నష్టం రూ.3.96 కోట్లు

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల తాకిడికి రూ.3.96 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 457 హెక్టార్లలో వరి, వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం తదితర పంటలు దెబ్బతినడంతో 481 మంది రైతులకు రూ.2.66 కోట్లకు పైగా నష్టం జరిగిందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. అలాగే బొమ్మనహాళ్, రాయదుర్గం, గుమ్మఘట్ట, కణేకల్లు, డి.హిరేహాళ్, బుక్కరాయసముద్రం, పామిడి, కూడేరు, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, రాప్తాడు, ఆత్మకూరు, నార్పల, బెళుగుప్ప మండలాల పరిధిలో 37 గ్రామాల్లో టమాటా, మిరప, బీర, సోర, వంగ, అరటి, చీనీ, ద్రాక్ష, దానిమ్మ, ఉసిరి, మామిడి, కర్బూజా, కళింగర తదితర ఉద్యాన పంటలు 135 హెక్టార్లలో దెబ్బతినడంతో 119 మంది రైతులకు 1.30 కోట్లకు పైగా నష్టం జరిగినట్లు అంచనా వేసినట్లు ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. చేతికొచ్చిన పంట నేలవాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సీజన్‌లో గత జూన్ నుంచి ఇప్పటి వరకు రూ.15 నుంచి రూ.17 కోట్ల వరకు పంట నష్టం జరిగినా ఇన్‌పుట్ జాబితా బాగా తగ్గిస్తుండటంతో అన్యాయం జరుగుతోందని రైతులు వాపోతున్నారు.

యువకుడి ఆత్మహత్య

పామిడి: కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడిలోని సంతమార్కెట్ వీధిలో నివాసముంటున్న బోయ సుంకన్న కుమారుడు ఓబులేసు (26) మద్యానికి బానిసయ్యాడు. ఆయనలో మార్పు రాకపోవడంతో విసుగు చెందిన భార్య ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఓబులేసు... గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.